క్లుప్తంగా

రక్తదాన దినోత్సవం



కార్యక్రమంలో జ్యోతి వెలిగిస్తున్న వైద్యురాలు అన్నపూర్ణ

ఉప్పలగుప్తం: మండలంలోని ఎస్.యానం గ్రామంలో ఉన్న వేదాంత పరిశ్రమలో ప్లాంటు ఏవో సోమస్‌దేవ్ ఆధ్వర్యంలో రక్తదాన దినోత్సవం సందర్భంగా గురువారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. అడిషనల్ డీఎంహెచ్‌వో భరతలక్ష్మి, ఏరియా ఆసుపత్రి బ్లడ్ సెంటర్ వైద్యాధికారి అన్నపూర్ణ జ్యోతి వెలిగించారు. 50 మంది ప్లాంటు సిబ్బంది రక్తదానం చేశారు.

మోగిన బడి గంటలు



అమలాపురం జెడ్పీ బాలుర పాఠశాలలో అసెంబ్లీలో పాల్గొన్న విద్యార్థులు

అమలాపురం టౌన్: వేసవి సెలవుల అనంతరం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు గురువారం తెరుచుకోవడంతో అమలాపురం, ముమ్మిడివరం నియోజవర్గాల్లో ఆయా పాఠశాలల వద్ద విద్యార్థుల సందడి కనిపించింది. రెండు నియోజకవర్గాల్లో ఉన్న సుమారు 35 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, దాదాపు 480 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు, 120 ప్రైవేటు పాఠశాలల్లో బడి గంటలు మోగాయి. అమలాపురం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన అసెంబ్లీలో డీవైఈవో గుబ్బల సూర్య ప్రకాశం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

అల్లవరం: మండలంలోని అల్లవరం, బెండమూర్లంక, దేవగుప్తం సబ్ స్టేషన్ల పరిధిలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఈఈ కె.రాంబాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 33కేవీ లైన్‌కు ట్రీ కటింగ్ నిర్వహించి, వార్షిక మరమ్మతులు నిర్వహిస్తామన్నారు. విద్యుత్ అంతరాయం సమయంలో వినియోగదారులు సహకరించాలన్నారు.

మధ్యాహ్న భోజనంలో సన్న బియ్యం

అమలాపురం టౌన్: జిల్లాలోని 1,534 ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంలో సన్న బియ్యం వినియోగాన్ని గురువారం నుంచి ప్రారంభించినట్లు జిల్లా పౌర సరఫరాల అధికారి (డీఎస్‌వో) అడపా ఉదయభాస్కర్ అన్నారు. అమలాపురంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఈ పథకాన్ని ఆయన ప్రారంభించారు. ప్రధానోపాధ్యాయుడు భమిడిపాటి వీఎస్ రామకృష్ణ పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి చెక్కు అందజేత

తాళ్లరేవు: ఏప్రిల్ 4వ తేదీన భైరవపాలెం కాలువలో పడి మృతి చెందిన చొల్లంగిపేట గ్రామానికి చెందిన ఈడీసీ సభ్యుడు దోనం చినఅప్పారావు కుటుంబానికి ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు రూ.లక్ష చెక్కు అందజేశారు. కాలువలో పూడికతీత పనులు చేస్తుండగా అప్పారావుకు ఛాతీలో నొప్పి రావడంతో పడిపోయాడు. తాళ్లరేవు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే గుండెనొప్పితో అప్పారావు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ నేపథ్యంలో ఫారెస్ట్ రేంజర్ ఎస్ఎస్ఆర్ వరప్రసాద్ ఆధ్వర్యంలో సీబీఈటీ కమిటీ సమక్షంలో మృతుని భార్య సుజాతకు ఎమ్మెల్యే రూ.లక్ష చెక్కును అందజేశారు.

మోదీది సుపరిపాలన

అమలాపురం రూరల్: ప్రధాని నరేంద్ర మోదీ 11 సంవత్సరాలు సుపరిపాలన అందించారని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, రాష్ట్ర బీజేపీ అధికార ప్రతినిధి పెద్దిరెడ్డి రవికిరణ్ అన్నారు. అమలాపురం మండలం భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలోగురువారం కోనసీమ జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సదస్సులో వారు మాట్లాడారు. కోనసీమ ప్రజల చిరకాల వాంఛ రైల్వే లైన్ పూర్తిచేసే విషయమై మోదీ దృష్టికి తీసుకెళ్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే అయ్యాజీ వేమా, జాతీయ కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యులు నల్లా పవన్ కుమార్, జిల్లా పూర్వ అధ్యక్షుడు యాళ్ల దొరబాబు, జిల్లా బీజేపీ అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడారు.

ఇంగ్లిష్ భాషాభివృద్ధికి ప్రత్యేక పుస్తకాలు

యానాం: ప్రభుత్వస్కూల్స్‌లో చదివే విద్యార్థుల్లో ఇంగ్లిషు భాషాభివృద్ధికి, అంగ్లంలో మాట్లాడేవిధంగా చేయడానికి ప్రత్యేకంగా పుస్తకాలను ఇస్తున్నట్లు పుదుచ్చేరి విద్యాశాఖామంత్రి నమశ్శివాయం తెలిపారు. గురువారం కూనిచంపట్టులో విద్యార్థులకు ఉచిత సైకిళ్లను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు త్వరలో ఉచిత బ్యాగ్‌లు, షూలు, పుస్తకాలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ శివగామి, డిడి గుణశేఖరన్ పాల్గొన్నారు.

అటకెక్కిన పీతల హేచరీ

- సర్కారు అలసత్వం
- పచ్చ పీతల విత్తనం లేక ఖాళీగా ఉన్న వేలాది ఎకరాలు



చిర్రయానంలో హేచరీ స్థలాన్ని పరిశీలిస్తున్న అప్పటి మత్స్యశాఖ కమిషనర్ దోలా శంకర్



పచ్చ పీత

కాట్రేనికోన: రాష్ట్ర వ్యాప్తంగా 971 కిలోమీటర్ల మేర సముద్ర తీరం వెంబడి ఉన్న ఉప్పునీటి కయ్యలు, పర్ర భూములు అనుకూలమైన ప్రాంతం కావడంతో రైతులు పచ్చ పీతలు సాగు చేస్తున్నారు. అయితే ధరలు అధికంగా ఉన్నా పచ్చ పీతల (గ్రీన్ క్రాబ్) సీడ్ అందుబాటులో ఉండడం లేదు. చెన్నైకు చెందిన రాజీవ్‌గాంధీ సెంటర్ ఫర్ ఆక్వా కల్చర్ హేచరీ నుంచి సీడ్ సరఫరా అవుతోంది. పీత సీడ్ కోసం దళారులు చేతివాటం చూపించడంతో రైతులకు ఖర్చు పెరుగుతోంది. పీత పిల్లలు లేక నీళ్లరేవు, చిర్రయానం, పల్లం, కొత్తపాలెం, ఎస్.యానం, రామేశ్వరం, తాళ్లరేవు ప్రాంతాలలో వేల ఎకరాల చెరువులు ఖాళీగా ఉన్నాయి. చిర్రయానంలో పచ్చ పీతల హేచరీ నిర్మాణం కోసం పదేళ్ల క్రితం ఎస్ఎఫ్‌డీబీ నిధులు రూ.2.75 కోట్లు, స్థలాన్ని మత్స్యశాఖ కమిషనర్ సమకూర్చారు. గత ఏడాది అక్టోబరు 23న 'సాక్షి' దినపత్రికలో 'పీతల సాగు ప్రోత్సహిస్తే సిరులు పంటే' శీర్షికతో ప్రచురితమైన కథనంతో అధికారులు స్పందించారు. చిర్రయానంలో పచ్చ పీతల హేచరీ నిర్మించే స్థలాన్ని కలెక్టర్‌తో పాటు అప్పటి మత్స్యశాఖ కమిషనర్ డోలా శంకర్, జేడీ ఎన్.శ్రీనివాస్, జిల్లా అటవీ శాఖ అధికారి ఎంవీ ప్రసాదరావు, యునైటెడ్ నేషన్స్ అభివృద్ధి ప్రోగ్రామ్ ప్రతినిధి డాక్టర్ సుదీప్ (ఢిల్లీ), బీఎస్ ప్రాజెక్టు స్టేట్ మేనేజర్ ఎస్.ఉష వేరువేరుగా పరిశీలించారు. పీతల సాగు చేస్తున్న రైతులతో అవగాహన సదస్సులు నిర్వహించారు. సర్వే నంబర్ 1లో ఐదు ఎకరాల్లో నిర్మించబోయే పచ్చ పీతల హేచరీ పనులు మూడు నుంచి ఆరు నెలల్ల పూర్తి చేసి పిల్లలను రైతులకు సరఫరా చేస్తామని అప్పట్లో మత్స్యశాఖ కమిషనర్ చెప్పారు. సీడును స్థానిక రైతులతో పాటు దేశ వ్యాప్తంగా సరఫరా చేస్తామన్నారు. అయితే అధికార పార్టీ నాయకుడు ప్రభుత్వ హేచరీకి కేటాయించిన స్థలాన్ని తమకు ఇస్తే పీతల హేచరీ నిర్మిస్తానని ఒత్తిడి తేవడంతో అతనికి స్థలాన్ని ఇచ్చారు. అయితే అతను హేచరీ నిర్మించలేదు. దీంతో ప్రభుత్వ పీతల హేచరీ అటకెక్కింది. అధికారులు ప్రభుత్వ హేచరీకి వేరొకచోట స్థలం సేకరించే పనిలో పడ్డారు. దీంతో పీత పిల్లలు అందుబాటులో లేక రైతులు చెరువులను ఖాళీగా ఉంచవలసి వచ్చింది.

పీతల ధరలు అదుర్స్

పచ్చ పీతలు రుచి అద్భుతంగా ఉండటంతో వాటికి గిరాకీ అధికంగా ఉంది. అరకేజీ పైబడిన పీతలను బిగ్ సైజ్ గాను, కేజీ బరువు ఉంటే ఎక్స్‌ఎల్ గాను ధరను నిర్ణయిస్తారు. పచ్చ పీత కేజీ నుంచి రెండు కేజీలు బరువు పెరుగుతుంది. బిగ్ ధర రూ.1,500, ఎక్స్‌ఎల్ ధర రూ.2,500 పలుకుతుంది. ఒక పచ్చపీతకు సరాసరి రూ.2,500 నుంచి రూ.3.500 వరకు వస్తుంది.

సాగును ప్రభుత్వం ప్రోత్సహించాలి

ప్రభుత్వం పచ్చ పీతల సాగును ప్రోత్సహిస్తే రైతులతో పాటు మత్స్య పరిశ్రమ అభివృద్ధికి దోహదం అవుతుంది. చిర్రయానం, ఎస్ యానం పర్రభూముల్లో సహజ సిద్ధంగా పచ్చ పీతలు పెరుగుతాయి. ప్రభుత్వం ఏటా పది లక్షల పచ్చ పీతల పిల్లలను వదిలితే మత్స్యకారుల జీవనోపాధి మెరుగుపడుతుంది. పీత పిల్ల ఒకటి రూ.12 చొప్పున బుక్ చేసుకున్న రైతులకు ఆరు నెలల తరువాత చెన్నై సంస్థ సరఫరా చేస్తోంది. ప్యాకింగ్, రవాణా చార్జీలకు రూ.3 అదనంగా ఖర్చు అవుతుంది. చెన్నై నుంచి రవాణా చేయడంతో పీతల బతుకుదల 50 శాతమే ఉంటోంది. చెరువుకు వచ్చేసరికి రూ.30 ఖర్చు అవుతోందని రైతులు అంటున్నారు. చిర్రయానంలో హేచరీ అందుబాటులోకి వస్తే సమయంతో పాటు రూ.12కు పీత సీడ్ రావడమే కాకుండా 90 శాతం బతుకుదల ఉంటుందన్నారు.

రైతులను మోసగించిన దళారులు

రాజీవ్‌గాంధీ సెంటర్ ఫర్ ఆక్వా కల్చర్‌కు చెందిన అధికారులతో కుమ్మక్కైన దళారులు పీత సీడ్‌ను సరఫరా చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. కాట్రేనికోన మండలం పల్లంకు చెందిన 26 మంది రైతులు ఒక పీత పిల్లకు రూ.23 చొప్పున 60 వేల పిల్లలకు రూ.14 లక్షలు దళారులకు చెల్లించారు. అయితే పచ్చ పీత పిల్లలకు బదులు నకిలీ పీతల(మండ పీతల)ను సరఫరా చేయడంతో తీవ్రంగా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. తమను మోసగించిన హేచరీపైన, దళారులపై కాట్రేనికోన పోలీసులకు ఫిర్యాదు చేశారు.

16న ఉచిత నేత్ర వైద్య శిబిరం

తాళ్లరేవు: క్రీమ్ సేవాసంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీన ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సంస్థ ప్రతినిధులు దొమ్మేటి వసంతరావు, దొమ్మేటి సామ్యూల్‌సాగర్ తెలిపారు. స్థానిక సంతపేట సెంటర్‌లోని హైస్కూల్ పక్కన గల బాప్టిస్టు చర్చిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు శిబిరం జరుగుతుందన్నారు. అవసరమైనవారికి కళ్లజోళ్లు అందజేయడంతోపాటు, ఉచిత ఆపరేషన్లు చేయనున్నట్లు తెలిపారు.

ఎన్నికల్లో సాంకేతికత వినియోగం

యానాం: 2026లో పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్నికల సమగ్రతను బలోపేతం చేయడానికి, ఓటర్ల భాగస్వామ్యాన్ని పెంచడం, ఓటరు సౌలభ్యాన్ని మెరుగుపర్చడం లక్ష్యంగా భారత ఎన్నికల సంఘం అనేక ఆధునిక సాంకేతిక స్థాయి మార్పులను ప్రవేశపెడుతుందని భారత ఎన్నికల కమిషన్ డిప్యూటీ డైరెక్టర్ పి.పవన్ పేర్కొన్నారు. పుదుచ్చేరిలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల కమిషన్ జాతీయ స్థాయిలో అఖిలపక్ష సమావేశాలను, రాజకీయ పార్టీల అధ్యక్షులతో పరస్పరం చర్చలను ప్రారంభించదన్నారు.

విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ

అమలాపురం రూరల్: వన్నెచింతలపూడి జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో సర్పంచ్‌లు పరమట శ్యామ్‌కుమార్, నక్కా రాజారత్న నాగవాణి, ఎంపీటీసీ సభ్యులు పరమట నాగమణి విష్ణుప్రసాద్, ప్రధానోపాధ్యాయుడు గుబ్బల నాగ సత్యనారాయణ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లను విద్యార్థులకు గురువారం పంపిణీ చేశారు.

బాల కార్మికుల భవిష్యత్తు అంధకారం



బాల కార్మిక వ్యవస్థ రూపుమాపుతాం అంటూ ర్యాలీ నిర్వహిస్తున్న అలర్ట్ సంస్థ, సీడీపీవో తదితరులు

అమలాపురం రూరల్: బాల కార్మికులుగా బాలలను కొనసాగిస్తే వారి భవిష్యత్తు అంధకారంలో ఉంటుందని ఐసీడీఎస్ సీడీపీవో రమాదేవి అన్నారు. ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని అలర్ట్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం అమలాపురంలోని మహిళా సమాఖ్య భవనంలో అలర్ట్ కో-ఆర్డినేటర్ శీలా శ్రీను అధ్యక్షతన సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన సీడీపీవో రమాదేవి మాట్లాడుతూ.. చిన్నవయసులోనే బాలలను పనిలో పెట్టుకోవడం వల్ల వారు శారీరకంగా,మానసికంగా అనేక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. కార్మికశాఖ అధికారి మల్లేశ్వర్ మాట్లాడుతూ పిల్లల పనిలో ఉంటే గుర్తించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. బాల కార్మిక వ్యవస్థ రూపుమాపుతాం, బాలలు పనిలో కాదు బడిలో ఉండాలి అనే నినాదాలతో ర్యాలీని నిర్వహించారు. జిల్లా డీసీపీవో విజయశ్రీ, ఏపీఎం సత్యనారాయణ, అంగన్వాడీ సూపర్ వైజర్లు, కార్యకర్తలు, కిషోర్ బాలికలు అలర్ట్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణతో మానవాళి మనుగడ

ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్



పర్యావరణ పరిరక్షణ వారంలో పాల్గొన్న ఎమ్మెల్యే అశోక్, అధికారులు

యానాం: పర్యావరణ పరిరక్షణ పైనే మానవాళి మనుగడ ఆధారపడి ఉందని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పేర్కొన్నారు. వరల్డ్ ఎన్విరాన్‌మెంట్ వీక్‌ను పురస్కరించుకుని గురువారం యానాం అగ్రి హార్టికల్చర్ సొసైటీ(వైఏహెచ్ఎస్) ఆధ్వర్యంలో స్థానిక ఎంజీజీబీహెచ్ ప్రభుత్వ హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. వైఏహెచ్ఎస్ కార్యదర్శి కామిశెట్టి వేణుగోపాలరావు, కార్యవర్గ సభ్యుల సేవలను అభినందించారు. ఈ సందర్భంగా పర్యావరణ ప్రియులకు వివిధ పోటీలను నిర్వహించారు.

విజేతలు...

పాట్‌కల్చర్ పోటీలో పెంటపాటి శాంతి, కిచెన్‌గార్డెన్‌లో తాడాల రాధ, రూఫ్‌టాప్‌లో ఆదమ్మ, ధూళిపూడి భాను విజేతలుగా నిలువగా బొకే మేకింగ్‌లో 84 మంది విద్యార్థులు పాల్గొనగా వారందరికీ బహుమతులుగా మొక్కలను పంపిణీ చేశారు. జిప్‌మెర్‌లో మొక్కలు నాటారు. రిటైర్డ్ వ్యవసాయ ఉద్యోగులు సూరంపూడి అచ్చుతరావు, టి శ్రీరాములను ఎమ్మెల్యే అశోక్ సత్కరించారు. జిప్‌మెర్ సీఎంఓ ఆనంద్‌రాజ్, విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్ ప్రవీణ్ పాల్గొన్నారు.

ఆర్టీసీ మోటార్ సైకిల్ స్టాండ్‌లో ప్రయాణికులకు దోపిడీ



అమలాపురం ఆర్టీసీ బస్సు డిపో

అమలాపురం రూరల్: అమలాపురం బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన సైకిల్ స్టాండ్‌లో నిర్వాహకులు అధిక రేట్లు వసూలు చేసి ప్రయాణికులు జేబులు గుల్ల చేస్తున్నారు. అమలాపురం బస్టాండ్‌కు గ్రామీణ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ప్రయాణికులు స్కూటర్లు, బైక్స్ వంటి వాహనాలపై వచ్చి బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన మోటార్ సైకిల్ స్టాండ్‌లో పెట్టుకుని బస్సుల్లో ప్రయాణాలు చేస్తుంటారు. గంటల ప్రాతిపదికన సైకిల్ స్టాండ్ నిర్వాహకులు డబ్బు వసూలు చేయాలి. ఆర్టీసీ నిబంధన ప్రకారం ఆరు గంటల లోపు రూ.20, 12 గంటల్లోపు రూ.30, 24 గంటల లోపు రూ.40, మోటార్ సైకిల్ పెట్టుకున్నందుకు వసూలు చేస్తారు. అయితే స్టాండ్ నిర్వాహకులు ఆర్టీసీ నిబంధనలు లీజు ఒప్పందాలను ఉల్లంఘించి తమ ఇష్టానుసారం డబ్బు వసూలు చేస్తున్నారు. స్టాండ్‌లో ధరలు పట్టిక ఎక్కడో లోపల కనిపించకుండా పెడుతున్నారు. నాలుగు గంటలకి రూ.20, 6 గంటలలోపు రూ.30, 6గంటలు దాటితే రూ.40, 24 గంటలకు రూ.50 చొప్పున వసూలు చేస్తున్నారు. లీజీదారులపై అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

మా గోడు వినేదెవరు...?



నిరసన వ్యక్తం చేస్తున్న ఇంజినీరింగ్ వర్కర్లు

అమలాపురం టౌన్: కూటమి ప్రభుత్వం ఏడాది పూర్తయిన సందర్భంగా తమ సమస్యలపై స్పందించి ఉంటే సంతోషించే వాళ్లమని 35 రోజులుగా సమ్మెలో ఉన్న మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్లు ఆవేదన వ్యక్తం చేశారు. మా గోడు వినేదెవరు...? అంటూ నినాదాలు చేశారు. తమ డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ తీసుకోకుండా కేవలం కమిటీలు వేసి చేతులు దులుపుకుంటూ జాప్యం చేస్తోందని మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్ల యూనియన్ ఆరోపించింది. తమకు కనీసం వేతనం టెక్నికల్‌కు రూ.29,500, నాన్ టెక్నికల్‌కు 24,500 ఇవ్వాలని డిమాండ్ చేసింది.

ఘనంగా షిర్డీ సాయి ఆలయ వార్షికోత్సవం

అమలాపురం రూరల్: బండారులంక చినచంద్రపురంలో శ్రీషిర్డీ సాయిబాబా ఆలయ 29వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. వేడుకలలో జేష్ఠ పూర్ణిమను పురస్కరించుకొని గురువారం జాన జగదీశ్ చంద్ర గణేష్, స్వాతి దంపతులు స్వామి వారికి రుద్రాభిషేకం, సహస్ర నామార్చన పూజలు ఘనంగా నిర్వహించారు. అన్నసమారాధన జరిగింది.ఆలయ కమిటీ చైర్మన్ కాశిన చిన్న, సెక్రటరీ జాన సత్తిరాజు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తాళ్లరేవు: మండల పరిధిలోని గాడిమొగ పంచాయతీ చినవలసల గ్రామానికి చెందిన వాడ్రేవు కృష్ణ(60) కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ తెలిపారు. బుధవారం కృష్ణ ద్విచక్ర వాహనంపై తాళ్లరేవు వస్తుండగా బైపాస్ రహదారిలో అకస్మాత్తుగా ఆవు అడ్డు రావడంతో అదుపు తప్పి పడిపోయాడు. ఈ ప్రమాదంలో అతని తలకు తీవ్రగాయమైంది. స్థానికులు అంబులెన్స్‌లో కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. అతనికి భార్య, పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అంతర్వేది దేవస్థానం ఏసీగా ప్రసాద్

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహ స్వామివారి దేవస్థానం నూతన అసిస్టెంట్ కమిషనర్‌గా ఎంకేటీఎస్వీ ప్రసాద్ గురువారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. తొలుత స్వామికి ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దేవస్థానం కార్యాలయంలో అర్చకుల వేదమంత్రాల మధ్య బాధ్యతలు తీసుకున్నారు. ఇంత వరకూ ఇక్కడ అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేసిన వి.సత్యనారాయణ కోనసీమ జిల్లా అసిస్టెంట్ కమిషనర్‌గా కొనసాగుతున్నారు.

డ్రైవింగ్ లైసెన్స్‌కు ఆధార్‌లింక్

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా నాలుగు రీజియన్‌లలో డ్రైవింగ్ లైసెన్స్‌లకు ఆధార్ నంబర్ లింక్ సరిగా అయిందో లేదో సరిచూసుకోవాలని గురువారం పుదుచ్చేరి ట్రాన్స్‌పోర్టు కమిషనర్ శివకుమార్ ప్రకటనలో కోరారు. అన్ని వాహనాల రిజిస్ట్రేషన్‌లకు, డ్రైవింగ్ లైసెన్స్‌లకు ఓటీపీ ఆధారిత సేవలు కేవలం వాహన యజమాని మొబైల్ నంబర్ నుంచే జరుగుతాయన్నారు.

19న మండల సమావేశం

తాళ్లరేవు: మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 19వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.సత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ రాయుడు సునీత అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

పోలింగ్ బూత్‌ల బయట ఫోన్ డిపాజిట్ కౌంటర్లు

యానాం: పోలింగ్ బూత్‌ల బయట మొబైల్ ఫోన్ డిపాజిట్ కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు ఎన్నికల కమిషన్ డిప్యూటీ డైరెక్టర్ పవన్ పేర్కొన్నారు. గురువారం పుదుచ్చేరి చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ జవహర్, డిప్యూటీ ఎలక్టోరల్ ఆఫీసర్ తల్లైవేలు, ఆదర్శ్‌లతో కలిసి ఆయన సంయుక్తంగా విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల పరంగా సంస్కరణలు చేపట్టామని, దానిలో భాగంగా ఒక్కో పోలింగ్ బూత్‌కు 1,500 ఓటర్ల నుంచి 1,200 మంది ఓటర్లకు తగ్గించినట్లు, పోలింగ్ ఎంట్రన్స్ గేట్ నుంచి 100 మీటర్ల దూరంలో ఇతరులు ఉండాలన్న దానిని సైతం తగ్గిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఎన్నికల కమిషన్ 40 యాప్‌లను ఉపయోగిస్తోందని కాని వాటిని అన్నింటిని ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చి ఈసీఐనెట్ అనే కొత్తయాప్‌ను తీసుకువచ్చినట్లు తెలిపారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం



దాత శరణ్య, సంయుక్తలకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ ప్రధానార్చకులు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వర స్వామివారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి కాకినాడకు చెందిన గుంటూరి శరణ్య, సంయుక్తలు రూ.10,371, అమలాపురానికి చెందిన మంగెన దీపక్ ఫణీంద్రలు రూ.10 వేల విరాళం సమర్పించారు. ఈ సొమ్మును ఆలయ ప్రధానార్చకుడు మాచరి వినాయకరావుకు ఇచ్చారు. దాతలను సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

నిబంధనలు పాటించని వారికి జరిమానాలు



వాహన తనిఖీ చేస్తున్న తాలూకా ఎస్సై శేఖర్‌బాబు

అమలాపురం రూరల్: రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా అమలాపురం బైపాస్ రోడ్డు కామనగరువు ఆమని ఆటో మొబైల్స్ కంపెనీ సమీపంలో బైపాస్ జంక్షన్ వద్ద గురువారం పోలీసులు వాహన తనిఖీలు చేశారు. తాలూకా ఎస్సై శేఖర్‌బాబు ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. హెల్మెట్, లైసెన్స్ తదితర ధ్రువీకరణ పత్రాలు లేని వాహన యజమానులకు జరిమానా విధించారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రతీ ఒక్కరు నిబంధనలు పాటించాలని ఎస్సై సూచించారు. హెల్మెట్ లేకుండా డ్రైవింగ్ చేస్తే రూ.1,000, లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేస్తే రూ.10,000, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తే రూ.5,000 వంతున జరిమానా విధిస్తామని చెప్పారు. ఈ తనిఖీల్లో ఏఎస్ఐ ఏడుకొండలు, హోంగార్డ్ రాంబాబు పాల్గొన్నారు.

మానసిక శక్తి బలమైంది



కొత్తపేట ఓంశాంతి భవనంలో యోగా సందేశం ఇస్తున్న రాజయోగిని రజని

కొత్తపేట: మానవులకు శారీరక శక్తి కంటే మానసిక శక్తి బలమైందని రాజయోగిని బ్రహ్మకుమారి రజని అన్నారు. ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం కొత్తపేట శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఓంశాంతి భవనం వద్ద యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ప్రముఖ అంతర్జాతీయ శిల్పి డాక్టర్ డి రాజ్‌కుమార్ వుడయార్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి, ఏజెన్సీ జిల్లాల రాజయోగ టీచర్, బ్రహ్మకుమారి రజని 'రాజయోగ విశిష్టత', నిత్య జీవితంలో మెడిటేషన్ ప్రాముఖ్యత, సంపూర్ణ ఆరోగ్యం, శారీరక, మానసిక బలం తదితర అంశాలపై ప్రత్యేక సందేశం ఇచ్చారు. యోగాతో ఏకాగ్రత, సృజనాత్మకత సాధించవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో యోగాకు ముఖ్యంగా మెడిటేషన్‌కు కొంత సమయం కేటాయించాలని బ్రహ్మకుమారి రజని సూచించారు. ముందుగా శివ పరమాత్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొత్తపేట శాఖ 36వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని కేక్ కట్‌చేసి అందరికీ పంచారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారి భవానీ, అన్నాజీ, సర్పంచ్ బూసి జయలక్ష్మి, ప్రభుత్వ ఆస్పత్రి కమిటీ సభ్యుడు కంఠంశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రెండు రోజులు యోగా పోటీలు

అమలాపురం రూరల్: యోగాంధ్ర మాసోత్సవాలలో భాగంగా శుక్ర, శనివారం ఉదయం 7.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు కలెక్టరేట్ గోదావరి భవన్‌లో యోగా పోటీలు నిర్వహిస్తారని ఆయుష్ వైద్యాధికారి కే. విజయ కుమారి తెలిపారు. యోగా షార్ట్ ఫిల్మ్ , యోగా ఫోటోగ్రఫీ నిర్వహిస్తారని ఆమె తెలిపారు.

కేజ్ కల్చర్ యూనిట్‌తో ఉపయోగాలు



పెదపట్నంలో కేజ్ కల్చర్ యూనిట్‌ను పరిశీలిస్తున్న నాబార్డు డీడీఎం నాయుడు

మామిడికుదురు: కేజ్ కల్చర్ యూనిట్‌తో ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని నాబార్డు డీడీఎం సోమునాయుడు తెలిపారు. పెదపట్నం గ్రామంలోని గోదావరి ప్రాంతంలో సాగు చేస్తున్న కేజ్ కల్చర్ యూనిట్‌ను ఆయన గురువారం పరిశీలించారు. గోదావరి ఫిష్ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ (ఎఫ్‌పీఓ) రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకుందని, దీని ఆధారంగా కేజ్ కల్చర్ మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ఇప్పటికే ఎఫ్‌పీఓ మెంబర్ షిప్ కూడా ప్రారంభమైందని చెప్పారు. ఈ నమోదు వల్ల భవిష్యత్తులో జరిగే నాబార్డ్ కార్యక్రమాల్లో మరియు ఫిష్ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములు అయ్యే అవకాశం ఉంటుందని చెప్పారు. కేజ్ కల్చర్ నిర్వాహకుడు లక్ష్మీనారాయణ, ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ చైర్మన్ కొల్లు శివరాజ్, సభ్యులు పాల్గొన్నారు.